సంపుటి :03 | సంచిక :53 | పేజీలు :07 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

ఆదివారం 5, ఏప్రిల్ 2026

## గంజాయి బ్యాచ్ వీరంగం

- స్వీట్ షాపుపై దాడి
- మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

04



## మక్కల కొనుగోలుపై


# ఫోకస్

### యాసంగి సీజన్ లో గణనీయంగా పెరిగిన మొక్కజొన్న పంట సాగు విస్తీర్ణం

ఈ ఏడాది యాసంగి సీజన్ లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొక్కజొన్న పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. పత్తి, మిరప పంటల సాగుతో ఆర్థికంగా నష్టపోయిన రైతులు మొక్కజొన్న పంట సాగుకు మొగ్గు చూపారు. దెబ్బతిన్న పత్తి, మిరప పంటల స్థానంలో మొక్కజొన్న పంట సాగు చేశారు. దీంతో మొక్కజొన్న పంట సాగు విస్తీర్ణం అనూహ్యంగా పెరిగింది. కొద్ది రోజుల నుంచి మొక్కజొన్న పంట దిగుబడులు రైతుల చేతికొస్తున్నాయి. విక్రయించేందుకు రైతులు మార్కెట్ కు తరలిస్తున్నారు. మొక్కజొన్న ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2400 ఉండగా వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువ ధరపై కొనుగోలు చేస్తున్నారు. దీంతో తాము ఆర్థికంగా నష్టపోతున్న దృష్ట్యా మార్క్ ఫెడ్ ద్వారా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే మద్దతు ధరతో మక్కలను కొనుగోలు చేయాలని రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం యాసంగి మొక్కజొన్నల కొనుగోలుపై ప్రత్యేక దృష్టి సారించింది. మార్క్ ఫెడ్ సహకారంతో వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో కొద్దిరోజుల నుంచి మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఆయా నియోజకవర్గంలోని స్థానిక ఎమ్మెల్యే ఈ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. వ్యాపారులకు అమ్మి నష్టపోకుండా మక్కలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రైతులను కోరుతున్నారు. –అక్షరదర్బార్, వరంగల్

02

- కొద్దిరోజుల నుంచి రైతుల చేతికి అందుతున్న మొక్కజొన్న దిగుబడులు
- మద్దతు ధరతో కొనుగోలుకు వ్యాపారుల నిరాసక్తత
- తెరపైకి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్
- పీఏసీఎస్ ల ఆధ్వర్యంలో మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు
- క్షేత్రస్థాయిలో మక్కల తీరును పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు





## డెడ్ లైన్ మే 15

- భద్రకాళి చెరువులో పూడికతీత పనులపై కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- పూడికతీత పనుల పురోగతిపై క్షేత్రస్థాయిలో పరిశీలన

04

అక్షరదర్బార్, హనుమకొండ: భద్రకాళి చెరువులో జరుగుతున్న పూడిక తీత పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు.





## నిర్లక్ష్యం ఉండొద్దు

- ఎంజీఎం వైద్యులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్ సత్యశారద
- సమయపాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలు
- ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య సేవలు, వసతులపై సమీక్ష

02



## విద్యార్థుల భవిష్యత్తు అంధకారం

హైడ్రా పేరుతో వేలకోట్ల కుంభకోణం

కాంగ్రెస్ సర్కార్ పై ఎంపీ ఈటెల రాజేందర్ ఫైర్

04

# నిర్లక్ష్యం ఉండొద్దు

- ఎంజీఎం వైద్యులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్ సత్యశారద
- సమయపాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలు
- ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య సేవలు, వసతులపై సమీక్ష

అక్షరదర్బార్, వరంగల్: జిల్లాలోని ఎంజీఎం ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద శనివారం సందర్శించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించేందుకు వివిధ విభాగాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలోని పలు వార్డులు, అత్యవసర విభాగం, ఔట్‌పేషంట్ విభాగం తదితరాలను సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, ఔషధాల లభ్యత, సిబ్బంది సమయపాలన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ సందర్శనలో జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, డీబీసీడీఓ పుష్పలత, ఆర్డీఓ సుమా, ఎంజీఎం, కేఎంసీ సుపరింటెండెంట్స్ హరీష్ చంద్రరెడ్డి, సంధ్య, ఫుడ్ సేఫ్టీ అధికారి, డ్రగ్స్ ఇన్ స్పెక్టర్, ఆర్ఎంఓలు, అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# లింగ నిర్ధారణ, లింగ ఎంపికపై కఠిన చర్యలు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గర్భంలో ఉన్న శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపిక వంటివి చట్ట విరుద్ధ చర్యలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. దీని కోసం కమిషనరేట్ పరిధిలో కట్టుదిట్టంగా చట్టాన్ని అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. గర్భంలోని శిశువు లింగాన్ని తెలుసుకోవడం, తెలియజేయడం, లేదా ఆ ఆధారంగా గర్భస్రావం చేయించడం వంటి చర్యలు సమాజానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆడ శిశువుల సంఖ్య తగ్గడానికి దారితీస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలోని అన్ని అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లు తప్పనిసరిగా చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ తోనే పనిచేయాలని, నిబంధనలను పూర్తిగా పాటించాలని అన్నారు. ఎక్కడైన లింగ నిర్ధారణ జరిగినట్టు గమనిస్తే పోలీస్ స్టేషన్ కు లేదా డయల్ 100, ఎస్ బీ 8712685257 కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలని సీపీ ప్రజలను కోరారు. ఆడపిల్లల సంరక్షణ, లింగ సమానత్వం కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# మక్కల కొనుగోలుపై ఫోకస్

- యాసంగి సీజన్ లో గణనీయంగా పెరిగిన మొక్కజొన్న పంట సాగు విస్తీర్ణం
- కొద్దిరోజుల నుంచి రైతుల చేతికి అందుతున్న మొక్కజొన్న దిగుబడులు
- మద్దతు ధరతో కొనుగోలుకు వ్యాపారుల నిరాసక్తత
- తెరపైకి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్
- పీఏసీఎస్ ల ఆధ్వర్యంలో మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు
- క్షేత్రస్థాయిలో మక్కల తీరును పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు



అక్షరదర్బార్, వరంగల్ : ఈ ఏడాది యాసంగి సీజన్ లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొక్కజొన్న పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. పత్తి, మిరప పంటల సాగుతో ఆర్థికంగా నష్టపోయిన రైతులు మొక్కజొన్న పంట సాగుకు మొగ్గు చూపారు. దెబ్బతిన్న పత్తి, మిరప పంటల స్థానంలో మొక్కజొన్న పంట సాగు చేశారు. దీంతో మొక్కజొన్న పంట సాగు విస్తీర్ణం అనూహ్యంగా పెరిగింది. కొద్ది రోజుల నుంచి మొక్కజొన్న పంట దిగుబడులు రైతుల చేతికొస్తున్నాయి. విక్రయించేందుకు రైతులు మార్కెట్ కు తరలిస్తున్నారు. మొక్కజొన్న ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2400 ఉండగా వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువ ధరపై కొనుగోలు చేస్తున్నారు. దీంతో తాము ఆర్థికంగా నష్టపోతున్న దృష్ట్యా మార్క్ ఫెడ్ ద్వారా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే మద్దతు ధరతో మక్కలను కొనుగోలు చేయాలని రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం యాసంగి మొక్కజొన్నల కొనుగోలుపై ప్రత్యేక దృష్టి సారించింది. మార్క్ ఫెడ్ సహకారంతో వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో కొద్దిరోజుల నుంచి మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఆయా నియోజకవర్గంలోని స్థానిక ఎమ్మెల్యే ఈ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. వ్యాపారులకు అమ్మి నష్టపోకుండా మక్కలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రైతులను కోరుతున్నారు. ఈ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు మక్కల కొనుగోళ్లపై ఫోకస్ పెట్టారు. కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ రైతులతో మాట్లాడుతున్నారు.

-

## రైతులకు ఇబ్బందులు కలగవద్దు.. : జిల్లా కలెక్టర్

జిల్లాలోని మొక్కజొన్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీస మద్దతు ధర కల్పిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. శనివారం మహబూబాబాద్ పట్టణం ఇల్లందు రోడ్డులోని వ్యవసాయ మార్కెట్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్‌కు వచ్చిన రైతులు, మార్కెటింగ్ మరియు వ్యవసాయ శాఖ అధికారులతో స్వయంగా మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఈ ఏడాది 1,30,000 ఎకరాలలో మొక్కజొన్న సాగు జరిగిందని, సుమారు లక్ష ఎకరాల దిగుబడి అమ్మకానికి వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ క్వింటాలుకు రూ.2,400 మద్దతు ధర చెల్లించాలని అధికారులకు సూచించారు. రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మార్కెట్ కమిటీ అధికారులను ఆదేశించారు.



## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు.. ఎమ్మెల్యే గండ్ర

రైతులు దళారుల మాయమాటలు నమ్మి తక్కువ ధరకు పంటను అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం కల్పించిన కొనుగోలు కేంద్రాల్లోనే మొక్కజొన్నను విక్రయించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. శనివారం గణపురం మండల కేంద్రంలోని కొత్తపల్లి మార్కెట్ యార్డులో మరియు భూపాలపల్లి రూరల్ మండలం గొర్లవేడు గ్రామంలో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో, ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,400 కనీస మద్దతు ధర చెల్లిస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. రైతులు విక్రయించిన పంటకు సంబంధించిన నగదును తక్షణమే వారి ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని భరోసా ఇచ్చారు.

# పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినదని మండల పశు వైద్యాధికారి సునీల్ తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పశువులు గల రైతు సోదరులు సద్వినియోగం చేసుకొని వ్యాధుల నుండి పశువులను కాపాడుకోవాలని ఈసందర్భంగా సర్పంచ్ సూచించారు.హనుమకొండ జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం నుండి డాక్టర్ నిఖిత కార్యక్రమాల పనితీరును పరీక్షించి రోగ నిరోధక శక్తిని అంచనా వేయుటకు కొన్ని పశువులలో రక్త నమూనాలను సేకరించడం జరిగినది.ఈ కార్యక్రమంలో సిబ్బంది రమేష్ బాబు, రవి, సదానందం రైతులు పాల్గొన్నారు.



# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

- రైతులు దళారులను నమ్మొద్దు
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

అక్షరదర్బార్, పరకాల:పరకాల పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద పరకాల పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శనివారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించిన ఆయన, కొనుగోలు కేంద్రాల్లోనే కనీస మద్దతు ధరగా క్వింటాల్‌కు రూ. 2400 అందుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నారని, రైతును రాజుగా నిలబెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్ర



మంలో ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- తిమ్మంపేట గ్రామ సర్పంచ్ మోడం శ్రీలతమల్లేష్
- విద్యార్థులను చేర్పించాలంటూ ఇంటింటా ప్రచారం

దుగ్గొండి, అక్షర దర్బార్ : ప్రభుత్వ పాఠశాలలోని నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు తమ పిల్లల్ని గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తిమ్మంపేట గ్రామ సర్పంచ్ మోడెం శ్రీలత మల్లేష్ గ్రామస్తులను కోరారు. శనివారం గ్రామ ప్రభుత్వ పాఠశాలలోనే అడ్మిషన్లు చేయించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీలత మల్లేష్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులే అన్ని అర్హతలు కలిగి నాణ్యమైన విద్యను బోధిస్తారన్నారు దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక రకమైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అందించే వసతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు నాడు ప్రభుత్వ పాఠశా




లలో విద్యను అభ్యసించిన విద్యార్థులే నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్, ఉపాధ్యాయులు రాజు, ప్రకాష్, యాకయ్య వార్డు మెంబర్స్ కునూరు సతీష్ కుమార్,దండు గౌతమి,గ్రామపెద్దలు బోనగానీ ఆగయ్యా, అక్కపెల్లి అశోక్, సంజీవ రవి తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- ప్రభుత్వ గ్రంథాలయానికి టేబుల్స్, చైర్స్ అందజేసిన జనతా ట్రస్ట్
- నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా ఉంటాం
- డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

అక్షర దర్బార్, నర్సంపేట : దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని నర్సంపేట జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి తెలిపారు. శనివారం నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉద్యోగ పరీక్షలకు చదువుకోవడానికి కనీస వసతులు లేవని తెలుసుకున్న జనతా ట్రస్ట్ సభ్యులు, వారి కోరిక మేరకు టేబుల్స్, చైర్స్ మరియు వాటర్ డిస్పెన్సర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి.. ట్రస్ట్



సభ్యులు దొడ్డ రవీందర్, నకిరెడ్డి మహేందర్, ఐనవోలు శివరాంలతో కలిసి ఈ వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సంపేట నియోజకవర్గంలో నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఎలాంటి సదుపాయాలు కావాలన్నా జనతా ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో గూడూరు సందీప్, దుంకదువ్వ రంజిత్, తనుగుల అంబేద్కర్, అచ్చ దయాకర్, కొంకిస విఘ్నేష్, ఠాకూర్ విజయ్ సింగ్, కాసుల నాగేంద్ర బాబు, రవీంద్ర చారి, బానోత్ రాజేందర్, సామల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు..
- కాలనీవాసుల ఆగ్రహం

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని 15వ వార్డులో ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసి కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్న ఘటనపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో బహిరంగంగా నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. సంబంధిత యజమానితో అధికారులకు ఏమైనా సంబంధాలున్నాయా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అక్రమాలు నిర్లక్ష్యం వల్ల మరింత పెరిగే అవకాశముందని, వెంటనే చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



# టెస్కో టెండర్ విధానాన్ని పునఃపరిశీలించాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు పద్మశాలి సంఘం వినతి

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : ప్రస్తుతం టెస్కో అమలు చేస్తున్న టెండర్ విధానం వల్ల చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. టెండర్ల వల్ల మధ్యవర్తుల ప్రమేయం పెరిగి, కార్మికులకు సరైన కూలి అందడం లేదని పేర్కొన్నారు. చిన్న సహకార సంఘాలను కాపాడేందుకు, ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మహేందర్, బిక్షపతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# హిందూ సమ్మేళనం విజయవంతానికి కృషి

అక్షర దర్బార్ / ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు జిల్లా కేంద్రంలో ఈనెల 18వ తేదీ శనివారం నిర్వహించనున్న 'హిందూ సమ్మేళన' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతం చేసేందుకు పలువురు ప్రముఖులు నడుం బిగించారు. సాయంత్రం 4 గంటలకు ములుగు మెయిన్ రోడ్డులోని మంజునాథపురం రావణ వధ జరిగే ప్రదేశంలో ఈ భారీ సమ్మేళనం జరగనుంది. ఈ కార్యక్రమ విజయవంతానికి తమ వంతు కృషి చేస్తున్నట్లు ప్రముఖులు కర్ర రాజేందర్ రెడ్డి, గంటకోట కుమార్, కోండి సాంబశివుడు, బాణాల సుధాకర్, ముక్కు సుబ్బారెడ్డి, చింతలపూడి భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దొంతి రెడ్డి వాసుదేవ రెడ్డి, అల్లే శోభన్, రెడ్డి రాజకుమార్, మేకల సంపత్, భాషబోయిన మహేందర్, తోడుపునూరు కిషోర్, ఇమ్మడి రాకేష్, ములుగు మాజీ సర్పంచ్ బండారి హరినాథ్, బైకని సాగర్, రుద్రారపు శంకర్ తదితరులు పాల్గొని, ఏర్పాట్లపై చర్చించారు. హిందూ సమాజమంతా ఏకతాటిపైకి వచ్చి ఈ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.



# గురు - శిష్యుల అపురూప కలయిక

○ ప్రజాసేవలో సరికొత్త ప్రయాణం

అక్షరదర్బార్, హనుమకొండ: వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఒక అరుదైన, భావోద్వేగపూరితమైన సన్నివేశానికి వేదికైంది. ఒకప్పుడు పోలీస్ యూనిఫాంలో భుజం భుజం కలిపి పనిచేసిన ఇద్దరు యోధులు, నేడు ప్రజా సేవకులుగా ఒకరినొకరు పలకరించుకున్నారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఉప్పు తిరుపతి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో గురు- శిష్యులుగా వీరు పనిచేసిన కాలంలో ఎదుర్కొన్న సవాళ్లను, కష్టసుఖాలను నెమరువేసుకున్నారు. విధి నిర్వహణలో భాగంగా చావు అంచులను తాకిన ఎన్నో కఠిన పరిస్థితులను జయించిన వీరి అన్యోన్యత అక్కడున్న వారిని ఆకట్టుకుంది.

**లక్ష్యం ఒక్కటే.. బాటలు వేరైనా**

ఒకరు నేడు ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధిలో దూసుకుపోతుండగా, మరొకరు (ఉప్పు తిరుపతి గారు) మంచిరామి గ్రామంలో తన భార్యను సర్పంచ్‌గా గెలిపించి, క్షేత్ర స్థాయిలో గ్రామ సేవకు అంకితమయ్యారు. "పోలీస్ శాఖలో శాంతిభద్రతల కోసం పోరాడిన వీరు, ఇప్పుడు మలి జీవితాన్ని ప్రజా సమస్యల పరిష్కారం కోసం అంకితం చేయడం నేటి యువతకు ఒక గొప్ప ఆదర్శం." అక్కడున్న నేతలు, కార్యకర్తలు, ప్రజలు వారి అంకితభావాన్ని చూసి ప్రశంసల జల్లు కురిపించారు. ఖాకీ బంధం నుంచి ప్రజా బంధం వరకు సాగిన వీరి ప్రయాణం మరెన్నో విజయాలు అందుకోవాలని ఆశిద్దాం!

# విద్యార్థుల భవిష్యత్తు అంధకారం

○ హైడ్రా పేరుతో వేలకోట్ల కుంభకోణం

○ కాంగ్రెస్ సర్కార్ పై ఎంపీ ఈటెల రాజేందర్ ఫైర్

అక్షరదర్బార్, వరంగల్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం వరంగల్ ఓసిటీలో బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయని ఈ అసమర్థ ప్రభుత్వం, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని ఈటెల మండిపడ్డారు. విద్యా వ్యవస్థను కాంగ్రెస్ సర్కార్ నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని, 'కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లు' రాష్ట్ర పరిస్థితి తయారైందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 'హైడ్రా' పేరుతో వేల కోట్ల రూపాయల కుంభకోణం జరుగుతోందని, భూకామాంధులు ప్రభుత్వంతో కుమ్మక్కై సామాన్యుల సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణలో దోచుకున్న ప్రతి పైసాను రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాలకు తరలించే ఆలోచనలో ఉన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చట్టసభలపై ప్రజలకు విశ్వాసం పోయేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎర్రబెల్లి ప్రదీప్ రావుతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గంజాయి బ్యాచ్ వీరంగం

○ స్వీట్ షాపుపై దాడి

○ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన



అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ నగరంలో గంజాయి ముఠాలు మరోసారి రెచ్చిపోయాయి. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పడమర కోట చమాన్ సమీపంలో శనివారం కొందరు యువకులు గంజాయి మత్తులో వీరంగం సృష్టించారు. స్థానిక స్వీట్ షాపు యజమానిపై దాడికి దిగడమే కాకుండా, దుకాణంలోని వస్తువులను ధ్వంసం చేయడం తీవ్ర కలకలం రేపింది. పడమర కోట చమాన్ ప్రాంతంలో గంజాయి సేవించిన కొందరు ఆకతాయిలు మత్తులో హల్ చల్ చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఒక స్వీట్ షాపులోకి చొరబడిన యువకులు.. చిన్నపాటి కారణంతో యజమానితో గొడవకు దిగారు. మత్తులో ఉన్న ఆకతాయిలు విచక్షణ కోల్పోయి యజమానిపై దాడికి యత్నించడమే కాకుండా, షాపులోని వేయింగ్ మెషిన్ (త్రాసు), కౌంటర్ పైన ఉన్న తినుబండారాలను కింద పడేసి చిందరవందరగా చేసి ధ్వంసం చేశారు.

○ పెరుగుతున్న గంజాయి సంస్కృతి

మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో గంజాయి విక్రయాలు, సేవించే వారి సంఖ్య పెరిగిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆకతాయిలు గంజాయి మత్తులో ఇళ్ల మధ్యే తిరుగుతూ దాడులకు పాల్పడుతున్నారని, పడమర కోట వంటి రద్దీ ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు జరగడం పట్ల వ్యాపారస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న మిల్స్ కాలనీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, గొడవకు దిగిన యువకులను గుర్తించే పనిలో పడ్డారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. నగరంలో గంజాయి విక్రయదారులపై, సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# డెడ్ లైన్ మే 15

○ భద్రకాళి చెరువులో పూడికతీత పనులపై కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

○ పూడికతీత పనుల పురోగతిపై క్షేత్రస్థాయిలో పరిశీలన



అక్షరదర్బార్, హనుమకొండ: భద్రకాళి చెరువులో జరుగుతున్న పూడిక తీత పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఇరిగేషన్, కుడా శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ భద్రకాళి చెరువులో పూడిక తీత పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించి, సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెరువులో మొత్తం ఏడు లక్షల డెబ్బై వేల క్యూబిక్ మీటర్ల పూడిక తీత లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు సుమారు ఒక లక్ష క్యూబిక్ మీటర్ల పూడికను తొలగించినట్లు తెలిపారు. మిగిలిన పనులను మరింత వేగంగా పూర్తి చేసి మే 15వ తేదీలోగా పూడిక తీత పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శాయంపేటలో జరుగుతున్న భూముల సర్వే పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ భూములు అక్రమ ఆక్రమణలకు గురికాకుండా కుడా ఆధీనంలో ఉన్న భూములకు వెంటనే ప్రహరీ గోడలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కుడా పీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్రావు, ఇరిగేషన్ ఈఈ కిరణ్ కుమార్, డీఈ మధుసూదన్, ఏఈ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి బూత్ స్థాయిలో బీజేపీ జెండాను ఎగురవేయాలి

○ ఎగురవేసి అంకితభావాన్ని చాటుకోవాలి

అక్షర దర్బార్ శాయంపేట : ఏప్రిల్ 6న భారతీయ జనతా పార్టీ స్థాపనదినోత్సవం దేశ వ్యాప్తంగా ప్రతి కార్యకర్తకు గర్వకారణమని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజేపి పార్టీ దేశాభివృద్ధి, జాతీయత, ప్రజాసేవ లక్ష్యాలతో ముందుకు సాగుతూ కోట్లాది ప్రజల విశ్వాసాన్ని పొందిందని తెలిపారు.ఈ నేపథ్యంలో శాయంపేట మండలంలోని ప్రతి బూత్ స్థాయిలో పార్టీ జెండాను ఎగురవేసి, పార్టీ పట్ల



మన అంకితభావాన్ని చాటుకోవాలని సూచించారు.మండలంలోని ప్రతి గ్రామంలో, ప్రతి బూత్ పరిధిలో కార్యకర్తలు సమన్వయంతో పని చేసి, పార్టీ జెండా ఎగురవేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.ప్రతి కార్యకర్త తమ ఇంటిపై కూడా బీజేపీ జెండా కట్టుకోవాలని, ఇది పార్టీ పట్ల గౌరవం మాత్రమే కాకుండా ప్రజలకు ఒక స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ఈ వేడుకలు కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, పార్టీ పట్ల మన నిబద్ధతను, దేశాభిమానం ప్రతిబింబించేలా జరగాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో, సమన్వయంతో ముందుకు సాగితే శాయంపేట మండలంలో పార్టీ మరింత బలపడుతుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే ఆసుపత్రులపై కఠిన చర్యలు!

- నర్సంపేటలో స్కానింగ్ సెంటర్ల తనిఖీ.. రికార్డుల పరిశీలన
- లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలు శిక్ష తప్పదు: డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్



అక్షర దర్బార్, నర్సంపేట : ప్రభుత్వ నిబంధనలు పాటించని ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఐ. ప్రకాష్ హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. సాంబశివరావు ఆదేశాల మేరకు శనివారం నర్సంపేట పట్టణంలోని జనని నర్సింగ్ హోమ్, కరుణ శ్రీ, వేద స్కానింగ్ సెంటర్లలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

- భ్రూణ హత్యలు చేస్తే ఉపేక్షించం..

అనంతరం డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆసుపత్రుల్లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు, భ్రూణ హత్యలు చేస్తున్నట్లు వస్తున్న ఫిర్యాదులపై సీరియస్ గా స్పందించామన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, పి.సి.పి.ఎన్.డి.టి (PCPNDT) చట్టం ప్రకారం అనుమతి లేకుండా సేవలు అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కేవలం గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు మాత్రమే పిండం స్థితిని తెలుసుకోవడానికి స్కానింగ్ ఉపయోగించాలని, అది కూడా వైద్య అవసరాల కోసమేనని గుర్తు చేశారు.

- తల్లిదండ్రులకు, వైద్యులకు శిక్ష తప్పదు..

లింగ నిర్ధారణ పరీక్షలను ప్రోత్సహించే తల్లిదండ్రులు, పరీక్షలు నిర్వహించే వైద్యులు సమానంగా శిక్షకు అర్హులని ఆయన తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారిపై పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎంసిహెచ్ డాక్టర్ విజయ్ కుమార్, ఎస్.ఓ విజయలక్ష్మి, సిహెచ్ఓ లీల, హెల్త్ ఎడ్యుకేటర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో 'జంపన్న' సేవాపథం

- రామచంద్రపురంలో వైద్య శిబిరం
- బిఆర్ఎస్ నేత ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ

అక్షర దర్బార్, ములుగు : గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా బిఆర్ఎస్ నాయకుడు భూక్య జంపన్న ఆధ్వర్యంలో ములుగు జిల్లాలో వైద్య శిబిరాలు నిరంతరం కొనసాగుతున్నాయి. శనివారం రామచంద్రపురం గ్రామంలో శారదా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. డాక్టర్ ప్రశాంత్ బృందం రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



# ఎడ్యుకేషన్ హబ్‌గా పరకాల

- ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి

అక్షర దర్బార్,పరకాల: పరకాల పట్టణాన్ని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని రాజుపేటలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పాఠశాల ద్వారా స్థానిక విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్య అందుబాటులోకి వస్తుందని చెప్పారు.నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా నిర్ణీత కాలంలో పూర్తి చేసి 18 నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు పారదర్శకంగా చేపడుతున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



# కన్న తల్లిదండ్రులు బరువు కాదు..బాధ్యత!

- వయోవృద్ధులను పట్టించుకోకుంటే కటకటాలే..!
- ముప్పు సురేష్ ఎస్సై మొగుళ్లపల్లి.



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి; నవ మాసాలు మోసి కనిపించిన తల్లిదండ్రులు దైవం కన్న మిన్న అని అంటారు.. తల్లిదండ్రులు భారం కాదు ఒక బాధ్యత...!!! అలాంటి కన్న తల్లిదండ్రులను వృద్ధాప్యంలో వారి ఆలన పాలన మరిచి వారిని మానసికంగా హింసిస్తే సీనియర్ సిటిజన్ యాక్ట్ -2007 ప్రకారం కఠిన చర్యలు తప్పవని మొగుళ్ళపల్లి ఎస్సె ముప్పు సురేష్ తెలిపారు. కన్న కొడుకులు తెనకు కనీసం కడుపునిండా తిండి కూడా పెట్టడం లేదని ఒక వృద్ధురాలు శనివారం మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ల మెట్లు ఎక్కింది... నడవలేని స్థితిలో ఉన్న ఆ ముసలి తల్లిని గమనించి తన చాంబర్ నుండి నేరుగా ఆమె వద్దకే వచ్చి ఒక కన్న కొడుకులా ..ఆమెను అక్కున చేర్చుకున్నాడు.. ఆమె సమస్యను సావధానంగా విని వారి కొడుకులను పోలీస్ స్టేషన్కు పిలిపించి గట్టిగా బుద్ధి చెప్పిన సంఘటన శనివారం మొగుళ్లపల్లి మండలం లో సంభవించింది. మొగుళ్లపల్లి మండలం బంగ్లాపల్లి గ్రామానికి చెందిన రాజమ్మ అనే వృద్ధురాలు తన ఇద్దరు కొడుకులు తనను కొద్దిరోజులుగా పట్టించుకోవడంలేదని తనను మానసికంగా వేధిస్తున్నారని భోజనం కూడా పెట్టడం లేదని తన దీనస్థితిని మొగుల్లపల్లి ఎస్ఐ ముప్పు సురేష్ కు వివరించింది.. వెంటనే స్పందించిన ఎస్సె ముప్పు సురేష్ రాజమ్మ ఇద్దరు కొడుకులను మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్కు పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు వృద్యాప్యంలో ఉన్న కన్న తల్లిదండ్రులను పట్టించుకోకుంటే సీనియర్ సిటిజన్ యాక్ట్-2007 ప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..

# పాడె మోసిన ఎస్సై అశోక్

- మానవత్వం చాటిన దామెర పోలీస్ అధికారి

అక్షరదర్బార్, పరకాల: సేవా భావం, మానవత్వం కలగలిపిన అరుదైన ఉదాహరణగా దామెర ఎస్సై కొంక అశోక్ నిలిచారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన కుమ్మరి అన్వేష్ భార్య కుమ్మరి నీత (23) అనారోగ్యంతో మృతి చెందగా, సమాచారం అందుకున్న ఎస్సై అశోక్ అంత్యక్రియలకు హాజరై పాడె మోసి తన మంచి మనసును చాటుకున్నారు.పోలీసు అధికారిగా మాత్రమే కాకుండా, సామాన్య ప్రజల బాధను పంచుకునే వ్యక్తిగా ఆయన చూపిన ఈ చర్య స్థానికులను కదిలించింది. గ్రామస్తులు ఎస్సై అశోక్ సేవా స్ఫూర్తిని ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.సమాజంలో పోలీసులపై విశ్వాసం పెంపొందించేలా ఆయన చేసిన ఈ పని అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.



# మహనీయుల జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- గ్రామ గ్రామాన ప్రభుత్వమే ఏర్పాట్లు చేయాలి: పుల్ల మల్లయ్య

అక్షర దర్బార్, చిట్యాల : మహనీయుల జయంతి ఉత్సవాలను గ్రామ గ్రామాన ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత పుల్ల మల్లయ్య కోరారు. శనివారం చిట్యాల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 5న బాబు జగ్జీవన్ రామ్, 11న జ్యోతిరావు పూలే, 14న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను కులమతాలకు అతీతంగా ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మేధావులు, యువకులు, రాజకీయ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# జనగణన ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలి

- మే 11 నుండి జూన్ 9 వరకు ఇండ్ల గణన
- తొలిసారిగా డిజిటల్ పద్ధతిలో జనగణన
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్.
- అధికారులకు దిశానిర్దేశం



అక్షర దర్బార్, ములుగు : జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను అత్యంత సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్. మహేందర్ జీతో కలిసి తహసీల్దార్లు, డీటీలు, ఎంపీఎస్ఓలు, ఆర్ఐలతో జనగణన, మ్యాప్ తయారీపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

**సాంకేతికతపై అవగాహన ఉండాలి..**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలోనే తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ పద్ధతిలో చేపడుతున్నట్లు తెలిపారు. అధికారులందరూ సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా డేటాను నమోదు చేయాలని సూచించారు. మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన కార్యక్రమం కొనసాగుతుందని, ఈ లోపే సన్నాహక పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. డిజిటల్ విధానం ద్వారా ప్రతి కుటుంబం వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, ముఖ్య ప్రణాళిక అధికారి ప్రకాశ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు మంజుల, ఎస్.ఓ. లాల్, తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలు మ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలి

- చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్

అక్షర దర్బార్, చిట్యాల : విద్యార్థులు యువకులు సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలని స్థానిక ఎస్సై పోచంపల్లి సతీష్ కోరారు శనివారం చిట్యాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లో విద్యార్థినులకు నేటి సమాజంలో జరుగుతున్న నేరాలు సైబర్ భద్రతపై చిట్యాల పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఎస్.ఐ. పోచంపల్లి సతీష్ ఎస్.ఐ-2 హేమలత లు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సోషల్ మీడియా వినియోగాన్ని తగ్గించి, విలువైన సమయాన్ని చదువుపై కేంద్రీకరించాలని ఎస్.ఐ. సూచించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవడం ప్రమాదకరమని, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకూడదని హెచ్చరించారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినా లేదా ఇబ్బంది పెట్టినా భయపడకుండా వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్స్ (కు సమాచారం అందించాలని కోరారు. బాల్యం నుంచే చట్టాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని, క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎస్.ఐ. పోచంపల్లి సతీష్ పేర్కొన్నారు.



# ఈజీఎస్ నిధుల వివక్షపై ఎమ్మెల్యే, కలెక్టర్ సమాధానం చెప్పాలి!

- బీఆర్ఎస్ గెలిచిన గ్రామాలకు నిధుల నిలిపివేత దారుణం
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి
- నిధుల మళ్లింపుపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాలని డిమాండ్

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట డివిజన్‌లో బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు గెలిచిన గ్రామాలకు ఉపాధి హామీ (EGS) నిధులను నిలిపివేయడంపై స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్యశారద సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నర్సంపేట పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా సర్పంచులు, కూలీలు కష్టపడి ఉపాధి పనులు చేస్తున్నప్పటికీ, నిధుల కేటాయింపులో రాజకీయ వివక్ష చూపడం అనైతికమని మండిపడ్డారు.



**అభివృద్ధికి గండి కొడుతున్నారు..**

ఉపాధి హామీ పథకంలోని 'మెటీరియల్ కాంపోనెంట్' నిధులను కేవలం కాంగ్రెస్ సర్పంచులు ఉన్న గ్రామాలకు మాత్రమే కేటాయిస్తున్నారని సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ సర్పంచులు ఉన్న చోట వచ్చిన నిధులను పక్క గ్రామాలకు మళ్లించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే తన స్వార్థ రాజకీయాల కోసం డివిజన్ అభివృద్ధికి గండి కొడుతున్నారని, ఈ వివక్ష ప్రజలందరికీ స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు.

**అధికారులు వంత పాడటం సిగ్గుచేటు..**

గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో అధికారులు వంత పాడటం సిగ్గుచేటని, ఈ వివక్షతకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్, ఈజీఎస్ అధికారులు వెంటనే స్పందించి అన్ని గ్రామాలకు సమన్యాయంగా నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా పుల్ల మల్లయ్య పుట్టినరోజు వేడుకలు

- అంబేద్కర్ ఫెలోషిప్ నేషనల్ అవార్డు గ్రహీతకు శుభాకాంక్షల వెల్లువ

అక్షర దర్బార్, చిట్యాల : అంబేద్కర్ ఫెలోషిప్ నేషనల్ అవార్డు గ్రహీత, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య పుట్టినరోజు వేడుకలను శనివారం చిట్యాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఆయనతో కేక్ కట్ చేయించి, స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



- పాల్గొన్న పలు పార్టీల నాయకులు..

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల సాంస్కృతిక కార్యదర్శి దాసరపు నరేష్, ఉపాధ్యక్షులు దూడపాక సరోత్తం, ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు పాల్గొన్నారు. అలాగే ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కోశాధికారి శీలపక నాగరాజు, ఉపాధ్యక్షులు పుల్ల అశోక్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు అల్లకొండ కుమార్, మిట్టపల్లి మిత్ర మండలి అధ్యక్షులు పుల్ల సతీష్ కుమార్, మాదిగ జాగృతి మండల అధ్యక్షులు నదునూరి రాజు, అంబేద్కర్ వాదులు కండే రమేష్, పుల్ల చందు మరియు విలేకరులు గుర్రపు రాజమౌళి, కాటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొని మల్లయ్యకు అభినందనలు తెలిపారు.

# టెస్కో టెండర్ వల్ల నేతన్నలకు నష్టాలు

- ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చిన పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్

అక్షర దర్బార్ చిట్యాల : తెలంగాణ రాష్ట్రంలో వేలాది కుటుంబాలకు ఆధారమైన చేనేత పరిశ్రమ ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు మాచెర్ల మహేందర్ తెలిపారు. చేనేత రంగాన్ని ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరుతూ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యానారాయణరావును కలిసి సమస్యలపై వినతి పత్రం



సమర్పించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ప్రస్తుతం టెస్కో అమలు చేస్తున్న టెండర్ విధానం కారణంగా ధరల పోటీ పెరిగి, మధ్యవర్తులు తక్కువ ధరలకు పనులు దక్కించుకుంటున్నారని పేర్కొన్నారు. దీనివల్ల చేనేత కార్మికులకు తగిన కూలి అందక వారి జీవనోపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి చేనేత కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం జిల్లా అధ్యక్షులు మాచర్ల మహేందర్, పద్మశాలి సంఘం నాయకులు భాగవతం బిక్షపతి, రాజేష్, రవీందర్, పల్లవేని సంపత్, పెంట రంజిత్ కుమార్, పెంట వేణు, రాజేందర్ పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై వేధింపులు

## నిందితుడిపై పోక్సో కేసు నమోదు

**నిందితుడిని రిమాండ్‌కు తరలింపు**

అక్షర దర్బార్ చిట్యాల : ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తూ, సోషల్ మీడియాలో పోస్టులు పెడతానని బెదిరింపులకు పాల్పడుతున్న నిందితుడిని చిట్యాల పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు శనివారం రిమాండ్ కు తరలించినట్లు చిట్యాల ఎస్.ఐ. పోచంపల్లి సతీష్ తెలిపారు. చిట్యాల మండలం దూతుపల్లి గ్రామానికి చెందిన బాణాల రాకేష్ అనే యువకుడు, ఒక మైనర్ బాలికను కొంతకాలంగా వెంటాడుతూ వేధిస్తున్నాడు. తనను ప్రేమించాలని, లేదంటే ఆమెకు సంబంధించిన విషయాలను సోషల్ మీడియాలో పెట్టి పరువు తీస్తానని సదరు బాలికను తీవ్రంగా భయభ్రాంతులకు గురిచేశాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు, బాలిక మైనర్ కావడంతో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన నిందితుడిని భూపాలపల్లి సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ గారి ఎదుట హాజరుపరచగా, న్యాయమూర్తి నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ మేరకు నిందితుడిని పోలీసులు జైలుకు తరలించారు. మైనర్ బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు పాల్పడినా చట్టం దృష్ట్యా కఠిన శిక్షలు ఉంటాయని ఎస్.ఐ. సతీష్ హెచ్చరించారు.